అంగవైకల్యం చిన్నారులకు ఉచిత వైద్యం

దుండిగల్, ఆగస్టు 13:సైబరాబాద్ పోలీస్, కూకట్‌పల్లిలోని ఆకార్ ఆశ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారుల్లో పుట్టుకతో వచ్చిన అంగవైకల్యానికి చికిత్స అందించనున్నట్లు బాచుపల్లి సీఐ ఉపేందర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారుల్లో కాలిన గాయాలు,కణతులు, వంకర కాళ్లు వంటి వాటితో బాధపడుతున్న వారికి ఎవరికైనా ఈ చికిత్సను పూర్తిగా ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ చిన్నారులు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రమేశ్‌ను గానీ, ఫోన్:8712663162లో గాని సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

శ్రీహరి (ఫైల్)

దుండిగల్, ఆగస్టు13: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి కనిపించకుండా పోయాడు. సూరారం పోలీసుల వివరాల మేరకు.. సంగారెడ్డి జిల్లా దోమడుగుకు చెందిన శ్రీహరి(21)నెల 9న సూరారం మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనంతరం ఈనెల 12న రాత్రి ఎలాంటి సమాచారం లేకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో అతడి సోదరి భవాని ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

శ్రీనివాస్ గుప్తాకు వ్యాపార వైభవ రత్న అవార్డు

మోతీనగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఇంటర్‌నేషనల్ వాసవి ఫెడరేషన్ నగర్ అధ్యక్షుడు ఊటుకూరు శ్రీనివాస్ గుప్తా వ్యాపార వైభవ రత్న అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్ వేదికగా కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ రుద్రక్షా వైభవం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బ్రహ్మశ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి చేతులమీదుగా అవార్డు అందించినట్లు ఆయన తెలిపారు.–అల్లాపూర్, ఆగస్టు 13

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, ఆగస్టు 13: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలోని శ్రీకల్యాణ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాన్యులకు కార్పొరేట్ వైద్య సేవలు అందించడంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, ఆలయ కమిటీ సభ్యులు రాంచంద్రారెడ్డి, నందగోపాల్, వెంకటేశ్, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కృష్ణమోహన్, ప్రధాన సలహాదారుడు రమేశ్, సభ్యులు సుబ్రమణ్యస్వామి, హరి రాఘవేంద్ర శ్రీధరాచార్యులు, సురేశ్ శర్మ, హనుమంతరాయ శర్మ, సీయంఆర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రియాజ్, డాక్టర్ సుమ, కోఆర్డినేటర్ రాజ్‌నారాయణ్ పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

హర్‌ఘర్ తిరంగాతో ఐక్యతను చాటుదాం..

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో దేశ ప్రజలంతా పాల్గొని ఐక్యతను చాటుదామని ఎమ్మెల్యే వివేకానంద్ పిలుపునిచ్చారు. మంగళవారం చింతల్‌లోని ఆయన కార్యాలయం వద్ద మేడ్చల్ జిల్లా తపాలాధికారి సంపత్‌రెడ్డి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేంద్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రషేకావత్ ఎమ్మెల్యేకు పంపించిన సందేశంతోపాటు జాతీయ జెండాను అందజేశారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ లాల్‌సింగ్, పోస్ట్‌మెన్ మారుతీ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో రూ.40లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్ మంగళవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, రహదారులకు ఇరువైపులా మట్టి వేసి చదును చేయాలని సూచించారు. కాలనీలో విరివిగా మొక్కలు నాటాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు. – మియాపూర్, ఆగస్టు 13

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీ ఫేజ్–1లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పెండింగ్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయిస్తానని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో కలిసి కాలనీలో పర్యటించిన అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో పెండింగ్ పనులను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ రమేశ్, ఏఈ రాజీవ్, ప్రశాంతి, మహదేవ్, సత్యనారాయణ, దాసు, ఓం ప్రకాశ్, వెంకటేశ్, రమణ, మురళీ, కాలనీవాసులు శ్రీనివాసదాసు, సైదేశ్వర్‌రావు, రామలింగేశ్వర్‌రావు, విలియమ్స్, ఆంజనేయులు, ప్రసాద్, శ్రీనివాస్, చంద్రమౌళి, కృష్ణకుమారి, జ్యోతి, ఉమారాణి, కుమారస్వామి, నిరంజన్ పాల్గొన్నారు. – మియాపూర్, ఆగస్టు 13

పాత్రికేయులకు అండగా నిలుస్తాం

కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.జగదీశ్వర్ గౌడ్

మాదాపూర్, ఆగస్టు 13: శేరిలింగంపల్లి నియోజకవర్గ పాత్రికేయులకు అన్ని విధాల అండగా నిలుస్తామని, సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి ఒక్క పాత్రికేయులకే ఉంటుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) నూతన అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మియాపూర్‌లోని అశోక గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యవర్గ సన్మాన కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. కలంతో సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి ఒక్క పాత్రికేయులకే ఉంటుందన్నారు. శేరిలింగంపల్లిలో పాత్రికేయుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసే విధంగా బాధ్యత తీసుకుంటామన్నారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ నూతన అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్‌ను సన్మానించి కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే–ఐజేయూ సభ్యులు, నాయకులు తదితరులు ఉన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లోని సేవ్ ఏ లైఫ్ సేఫ్టీ ఫర్ హ్యూమానికి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీలోని రాజేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికాలో నివసిస్తున్న సూరగన నిఖిల శాన్వి జన్మదినం సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాణాప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో వసంతనగర్ సొసైటీ డైరెక్టర్ నాగిరెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 13

కాలనీ అభివృద్ధికి తోడ్పాటునందిస్తా : ఎమ్మెల్యే గాంధీ


నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఆగస్టు 13: కాలనీ సంక్షేమ సంఘాలు ప్రజల భాగస్వామ్యంతో పురోగతికి ముందుకు సాగాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. మౌలిక వసతుల కల్పన సంపూర్ణ అభివృద్ధికి తన పూర్తి తోడ్పాటును అందిస్తానన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ వాంబే కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు ఎమ్మెల్యే గాంధీని మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో పచ్చదనం–పరిశుభ్రత సహా సామాజికాంశాలపై కాలనీ వాసులందరినీ భాగస్వాములు చేస్తూ నూతన సంఘం పాలన కొనసాగించాలని, ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుకునేలా పాటుపడాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని, పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మురళి, శ్యామలరావు, శ్రీను, మౌనిక, సాయి, రాకేష్, వేణుగోపాల్, యాదగిరి, కరుణాకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సౌకర్యవంతమైన రోడ్లు నిర్మిస్తాం

డివిజన్‌లోని అన్ని కాలనీల్లో సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పేర్కొన్నారు. హనుమాన్‌నగర్, ఈనాడు కాలనీల్లో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం నిమిత్తం స్థానికులతో కలిసి కార్పొరేటర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రోజాదేవి మాట్లాడుతూ.. మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఏఈ ఆశ, ప్రియాంక, విఠల్, నర్సింహ, ఎర్రన్న, శ్రీను, నారాయణ పాల్గొన్నారు. – మియాపూర్, ఆగస్టు 13

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్

దుండిగల్, ఆగస్టు 13: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్, రైజీనియా నుంచి తిరుమల ఎన్‌క్లేవ్ వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందిస్తూ దశలవారీగా, ప్రణాళికాబద్ధంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రూ.15లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాఘవేంద్రరావు, యువ నాయకులు ఆనంద్‌రెడ్డి, డీఈ వసంత, ఏఈ లక్ష్మీనారాయణ, స్థానిక అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

– 26వ డివిజన్‌లోని బృందావన్ హిల్స్, మధురా నగర్, ప్రశాంతి హిల్స్ కాలనీల్లో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్పొరేటర్ రాఘవేంద్ర రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా కార్పొరేషన్ పరిధిలో రోడ్లపై వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జగద్గిరిగుట్ట, ఆగస్టు 13: ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా..వేగంగా పోలీసుల స్పందించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ తెలిపిన ప్రకారం..బీరప్పనగర్‌లో నివాసముండే బీరం బాబి(28) ఓ ప్రైవేటు ఉద్యోగి. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం తాను డ్యూటీకి వెళ్తున్నాని చెప్పి ఇంటినుంచి వెళ్లాడు. ఆపై తన బంధువుకు ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్‌లో చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అతడి బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చి కాపాడాలని కోరారు. అతని ఫోన్ సిగ్నల్స్‌తో మహంకాళి ప్రాంతంలో ఓ లాడ్జిలో ఉన్నట్లు తెలుసుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకొని పురుగుల మందు తాగిన అతడిని గాంధీకి తరలివచ్చి వెంటనే చికిత్స అందిండంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. చాకచక్యంతో వ్యక్తి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని సీఐ అభినందించారు.

కార్పొరేట్ తరహాలో కార్యాలయాన్ని తీర్చిదిద్దాలి

- జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి
- వాల్ పెయింటింగ్, స్ట్రీట్ ఫర్నిచర్‌ను వృద్ధిపరచాలి

మియాపూర్, ఆగస్టు 13:నగరంలో ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న శేరిలింగంపల్లి జోన్‌ను అంతే స్థాయిలో అద్భుతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. అతి ప్రధానంగా నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శించే జోనల్ కార్యాలయం, పరిసరాలు కార్పొరేట్ స్థాయిలో ఉండేలా సుందరీకరించాలని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయా విభాగాల అధికారులతో కలిసి జడ్సీ ఉపేందర్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి నుంచి పుల్లెల గోపీచంద్ అకాడమీ వరకు కాలినడకన పారిశుధ్య నిర్వహణ, రహదారి పరిస్థితి, పుట్‌పాత్‌లు, బ్రహ్మకుమారీస్ సంస్థ పరిసరాలలో పచ్చదనం పరిసరాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. జోన్‌కు పరిపాలనా కేంద్రంగా ఉన్న జోనల్ కార్యాలయ ఆవరణలోని ఫౌంటేన్‌ను నిత్యం ఉదయం, సాయంత్రం వేళలో పని చేయించాలని, కార్యాలయం లోపల లిఫ్ట్ సమీపంలోని పచ్చదనం ప్రాంతంలో అత్యాధునిక రీతిలో తీర్చిదిద్దాలన్నారు. గ్రౌండ్, తొలి, రెండవ అంతస్థుల్లో ఉద్యోగుల సంఖ్య ఆధారంగా అధునాతన క్యాబిన్‌లను ఏర్పాటు చేసి కార్యాలయ పరిసరాలను మరింత ఆధునికీకరించాలన్నారు. శౌచాలయాలను నిత్యం మరింత పరిశుభ్రంగా ఉంచాలని జడ్సీ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి ప్రధాన రహదారి పరిసరాలలో పాదచారుల సౌకర్యార్థం ఫుట్ పాత్‌ల పునరుద్ధరణ, అందమైన వాల్ పెయింటింగ్‌లు, సెంట్రల్ మీడియం, స్ట్రీట్ ఫర్నిచర్‌తో కూడళ్లను అతి సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. రహదారుల వెంట విద్యుత్ దీపాలు పని చేసేలా తనిఖీలు చేపట్టాలని, అవసరమైతే కొత్త దీపాలను అమర్చాలన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ పరిసరాలలో పారిశుధ్య పరిస్థితులను మరింతగా మెరుగుపరచి, రహదారులపై పేర్కొన్న వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీ రజనీకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్, బయోడైవర్సిటీ, పారిశుధ్య విభాగం అధికారులు ఉన్నారు.

బ్రహ్మకుమారీస్ ప్రతినిధులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

ఎమ్మార్పీఎస్ ర్యాలీకి తరలిన మాదిగ జర్నలిస్టులు

ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి వెళ్తున్న కుత్బుల్లాపూర్ ఎంజేఎఫ్, ఎంఆర్‌పీఎస్ నేతలు

దుండిగల్/కుత్బుల్లాపూర్, ఆగస్టు 13: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని సికింద్రాబాద్ నుంచి బషీర్‌బాగ్ వరకు జరిగిన మాదిగల విజయోత్సవ ర్యాలీకి ఎంజేఎఫ్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు పండి గణేశ్ మాదిగ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ మాదిగ జర్నలిస్టులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎంజేఎఫ్ జాతీయ నాయకులు ముక్కెర్ల లాలయ్య, డప్పు రామస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు మాదిగ, ఎంఆర్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నా మాదిగ పాల్గొని మాట్లాడారు. మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల ఆకాంక్ష అయిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు.కార్యక్రమంలో ఎంజేఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తొండ వెంకట్, సురకొంటి శ్రావణ్, పండి నరేశ్, దీపు, ముత్యపాగ శ్రీశైలం, అనిల్, ఎమ్మార్పీఎస్ నేతలు బూరు రవి, ఎ.ఎస్తేర్ రాణి, యాకుబ్, జలగం చంద్రయ్య, ఇంద్రాల లక్ష్మి, జిన్నపాక చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ మార్కెట్‌లో మత్స్యకారులకు షాపులు కేటాయించాలి


కేపీహెచ్‌బీకాలనీలోని జీహెచ్ఎంసీ ఫిష్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న బండి రమేశ్, సతీశ్‌రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 13 : కేపీహెచ్‌బీ కాలనీ ఫిష్ మార్కెట్‌లో గంగపుత్రులు, మత్స్యకారులు, ముదిరాజ్‌లకు షాపులను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీలోని ఫిష్ మార్కెట్‌ను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఫిష్ మార్కెట్‌లో 86 షాపులకు గాను...30 షాపులు మాత్రమే నడుస్తున్నాయని, ఈ షాపులను గంగపుత్రులు, ముదిరాజ్‌లు కాకుండా ముస్లిం, కమ్మ, కాపులకు కేటాయించడం జరిగిందని, తద్వారా మత్స్యకారులకు అన్యాయం జరుగుతుందన్నారు. అలాగే షాపులు కేటాయించిన వారు ఇతరుకుల ఆ షాపులను అద్దెకు ఇచ్చి.. ఎక్కువ అద్దెలను వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే పాత అసోసియేషన్‌ను రద్దు చేసి, బినామీ షాపులను తొలగించాలని, గంగపుత్రులు, ముదిరాజ్‌ల ఉపకులాలందరికి షాపులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఫణీంద్ర, అరవింద్‌రెడ్డి, మేకల మైకల్, రాజు, రవి, సంజీవరావు, అప్పారావు, రంగస్వామి, గంధం రాజు, కొప్పి శెట్టి దినేశ్‌కుమార్, సంతోష్, బాబు, రేష్మా, సంధ్య, రజిత, యమున, రాజ్యలక్ష్మి, మక్దుమ్, శివ చౌదరి, బాబ్జి, బచ్చు మల్లి, వెంకటేశ్వర్ రావు, గిరి, ఆది, బాబు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం

శారీరక మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని కేపీహెచ్‌బీ కాలనీ సీఐ ఎం.వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ ఎం.వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక స్థైర్యం బలపడుతుందని, మానసిక ఉత్తేజంతోపాటు శారీరక దారుఢ్యానికి దోహదపడుతాయన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నేతలను అభినందించారు. క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, పోటీల్లో పాల్గొన్నప్పుడే క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు రాహుల్‌నాయక్, చంద్రశేఖర్ పటేల్, రంజిత్‌యాదవ్, ఆశృత్, అనిశ్ గౌడ్, రోహిత్, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 13

ఫీనిక్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నానక్‌రాంగూడలోని ఫీనిక్స్ అక్విలాలో మంగళవారం జరిగిన రక్తదాన శిబిరంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 11వ డివిజన్ కార్పొరేటర్ వాకలపూడి రవికిరణ్ పాల్గొన్నారు. చక్‌పల్లి శంకర్‌రావు గౌరవార్థం నిర్వహించిన ఈ శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేయగా, వారికి రవికిరణ్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. – దుండిగల్, ఆగస్టు 13

రేపు ఆధునిక ధర్మపీఠం ప్రారంభం

- కూకట్‌పల్లిలో ఐదెకరాల స్థలంలో రెండు కోర్టు భవనాలు
- రూ.43కోట్లతో ఐదు అంతస్థులతో నిర్మాణం
- 14 కోర్టులతో సేవలకు సిద్ధం

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 13: కూకట్‌పల్లిలో ఆధునిక ధర్మపీఠం ఈ నెల15వ తేదీన అందుబాటులోకి రానున్నది. 18 ఏండ్ల కిందట పురుడుపోసుకున్న కూకట్‌పల్లి 9వ మెట్రోపాలిటన్ న్యాయస్థానం ఇన్నాళ్లు అద్దె భవనాల్లో కొనసాగగా, వివిధ అడ్డంకులను దాటుకుని త్వరలోనే సొంత భవనంలో కొలువుతీరనున్నది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోర్టును 2006లో విభజించి పలు ప్రాంతాల్లో మెట్రోపాలిటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కూకట్‌పల్లి 9వ మెట్రోపాలిటన్ కోర్టును ఏర్పాటు చేశారు. మియాపూర్‌లోని ఓ అద్దె భవనంలో కోర్టు సేవలు ప్రారంభమై.. తర్వాత 2018లో కూకట్‌పల్లిలోని ప్రశాంత్‌నగర్‌లో మరో అద్దె భవనంలోకి మారింది. జిల్లా న్యాయస్థానంగా హోదా పెరగగా.. ప్రస్తుతం 14 విభాగాలుగా విస్తరించి సేవలందిస్తున్నది. ఇన్నాళ్లు ఇరుకు గదుల్లో, వసతులేని భవనాల్లో కోర్టు సిబ్బందితోపాటు కక్షిదారులు, న్యాయవాదులు ఇబ్బందులు పడ్డారు. ఇన్నాళ్ల కష్టానికి త్వరలోనే మోక్షం లభించనున్నది. ఈ స్థలాన్ని కాజేసేందుకు కొందరు వ్యక్తులు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవడం జరిగిందని కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అర్శనపల్లి ప్రకాశ్‌రావు తెలిపారు. పలు ధర్నాలు చేసి, న్యాయస్థానాన్ని ఆశ్రయించి మూడేండ్ల పాటు పోరాటాలు చేశామని చెప్పారు. నేడు ఆధునిక హంగులతో కోర్టు నిర్మాణ పనులు పూర్తికావడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ పోరాటంలో నాతోటి న్యాయవాదులతో పాటు 'నమస్తే తెలంగాణ దినపత్రిక 'అందించిన సహకారం మరువలేనిదన్నారు.

ఐదు ఎకరాల్లో రెండు భవన సముదాయాలు..

కూకట్‌పల్లి గ్రామ పరిధిలోని కైత్లాపూర్ సమీపంలో ఐదెకరాల స్థలంలో రెండు భవన సముదాయాలు నిర్మించారు. నిర్మాణానికి సంబంధించిన డిజైన్‌లో న్యాయమూర్తుల కోసం నివాస భవనానికి నిధులు కేటాయించినప్పటికీ...వారు అక్కడ నివసించేందుకు ఆసక్తి చూపలేదు. ఆ నిధులతో పక్కనే నిర్మించిన రెండు అంతస్థుల భవనంలో పోక్సో, ఫ్యామిలీ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ భవన సముదాయంలో పోస్టాఫీస్, బ్యాంకులు, బార్ అసోసియేషన్ కార్యాలయం, క్యాంటిన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఐదు అంతస్థులతో నిర్మించిన ఈ భవనాల్లో 14కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. 3వ అదనపు జిల్లా న్యాయస్థానం(మేడ్చల్), సీనియర్ సివిల్ కోర్టు(మేడ్చల్), మేజిస్ట్రేట్ కోర్టులు 3(మేడ్చల్), 6వ అదనపు జిల్లా జిల్లా న్యాయస్థానం(రంగారెడ్డి), సీనియర్ సివిల్ కోర్టు (రంగారెడ్డి), మేజిస్ట్రేట్ కోర్టులు 4 (రంగారెడ్డి)లతో మరిన్ని కోర్టులు కొలువుదీరి ప్రజలకు సత్వర న్యాయసేవలు అందించనున్నాయి.